

# చీకటి వెలుగు

సామాజిక రాజకీయ ఆధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక

నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 17 | సంచిక :270 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 31-01-2026 శనివారం | పేజీలు : 4 | వెల : రూ. 3

చీకటి వెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫోటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను

ఎడిటర్ : కంది సూర్యనారాయణ

సెల్ : 9848052327

## తెలంగాణలో వ్యవసాయం భేష్...



**హైదరాబాద్, జనవరి 30:**ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగా నిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగా మార్చాయి.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినకొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు.అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ - మిగతా3లో



## రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత..

**హైదరాబాద్ జనవరి 30:** తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. శాసనమండలిలో ప్రసంగించిన కవిత..ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నా..శక్తిగా తిరిగి చట్టసభల్లో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్లారు. అసెంబ్లీ ముందున్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించి.. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానని ఆమె ప్రకటించారు.మరోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ద్వారానే పోటీ చేస్తామని కవిత చెబుతూ వస్తున్నారు. తాను - మిగతా3లో

## కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...



**హైదరాబాద్, జనవరి 30:**మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం - మిగతా3లో

## ఏఐపై మోడీ మేధోమధనం...

**న్యూఢిల్లీ, జనవరి 30:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తున్న తరుణంలో భారత్ ఈ రంగంలో అగ్రగామిగా ఎదగడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక అడుగులు వేస్తున్నారు. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన నివాసంలో దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీల సీఈవోలు, ఏఐ నిపుణులతో ప్రధాని ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరిలో జరగనున్న ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత




సంతరించుకుంది.భారతదేశం యూపీఐ ద్వారా ప్రపంచానికి తన సాంకేతిక నైపుణ్యాన్ని ఇప్పటికే నిరూపించుకుందని.. ఇప్పుడు ఏఐ రంగంలో కూడా అలాంటి విజయాలు సాధించాలని ప్రధాని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో స్వదేశీ ఏఐ సాంకేతికతను ప్రోత్సహించాలని, టెక్నాలజీలో స్వావలంబన సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ వద్ద ఉన్న డేటా వైవిధ్యం, ప్రజాస్వామ్య విలువలు ప్రపంచ దేశాలకు - మిగతా3లో

## తెలుగు రాష్ట్రాల జల వివాదంపై ఢిల్లీలో కీలక చర్చలు..

**న్యూఢిల్లీ, జనవరి 30:** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. జనవరి 2న కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన ఈ కమిటీ ఇరు రాష్ట్రాల మధ్య నీటి నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించనుంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ చైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ - మిగతా3లో

## బీసీలకు మొండి చేయి...?



**హైదరాబాద్, జనవరి 30, :** సుదీర్ఘ కాలంగా బీసీలు తమ జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్ అమలు కావాలని ఎదురుచూస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల హక్కు సాకారం చేసుకునేందుకు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర జనాభాలో పెద్ద వాటా ఉన్న బీసీ వర్గాలకు రాజకీయంగా, పరి పాలనాపరంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని అధికార పక్షం హామీ ఇచ్చింది.కానీ ఆ హామీ చట్టబద్ధ హక్కుగా మారకుండానే స్థానిక ఎన్నికల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరుగనుండగా.. రిజర్వేషన్ల విషయంలో అదే వైఖరి కనిపిం చడంతో బీసీల హృదయాలను కలచివేస్తున్నది. ఎన్నికల వేళ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ ఆశలు రేపిన ప్రభుత్వం ఈ డిమాండ్‌ను అమలుచేసే దశలో స్పష్టత చూపించలేకపోతోందని బీసీలు ఆగ్రహిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రతిపక్షాలు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ కేవలం గాలిమాటేనా అని బీసీలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని చట్టబద్ధంగా అమలు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు బీసీల నుంచి వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ సవరణలు, జనాభా లెక్కలు, న్యాయపరమైన అడ్డంకుల పేరుతో నిర్ణయాలు వాయిదా పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది సాధారణమైన హామీ కాదు. బీసీల సామాజిక - మిగతా3లో

## మున్సిపల్స్.. ఎవరి లెక్కలు వారివి

**కరీంనగర్, జనవరి 30:**తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు.ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు.అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ




మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది.ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది. పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, - మిగతా3లో

## కమలం గేర్ మార్పు..

**హైదరాబాద్, జనవరి 30:**తెలంగాణ రాజకీయ యవనికపై ప్రత్యామ్నాయం మేమే అని విర్రవీగిన భారతీయ జనతా పార్టీకి, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. ఒకప్పుడు రాష్ట్రంలో నెంబర్ 2 స్థానానికి ఎదిగామని, ఇక అధికారమే తరువాయి అని సంబరపడ్డ కమలదళానికి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇంకా అట్టడుగునే ఉందన్న చేదు నిజం బోధపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలను బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు, పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు ఒక అగ్నిపరీక్షగా భావిస్తోంది.ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ అధిష్టానం ఈసారి వ్యూహాన్ని మార్చింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర నాయకత్వానికి వదిలేసే కేంద్ర పెద్దలు, ఈసారి నేరుగా రంగంలోకి - మిగతా3లో



## సంపాదకీయం

# కార్పొరేట్ల లాభాల కోసం.. అమెరికా సామ్రాజ్యవాదం

ప్రపంచంలో ప్రజాస్వామ్యం, మానవహక్కులు అనే పేర్లతో నడుస్తున్నది వాస్తవానికి కార్పొరేట్ సామ్రాజ్యవాదమే. చమురు, సహజ వనరులు, డాలర్ ఆధిపత్యం కోసం అమెరికా అనేక దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ దాడులు, ఆంక్షలు, రాజకీయ జోక్యాలను సాధనాలుగా మార్చుకుంది. వెనిజులా వంటి దేశాలపై జరుగుతున్న పరిణామాలు ఈ సామ్రాజ్యవాద విధానానికి స్పష్టమైన ఉదాహరణలు.. అణ్వాయుధాల యుగంలో ప్రపంచం మౌనం వహిస్తే, రేపటి మానవ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. చమురు కోసం, సహజ వనరుల కోసం, ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ హోదా కోసం అమెరికా అగ్రరాజ్యం అనేక దేశాలపై దాడులు దండయాత్రలు చేస్తూ తన సామ్రాజ్యవాదాన్ని కార్పొరేట్ల లాభాల కోసం విచ్చలవిడిగా బరితెగించి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. వలస పాలన కన్నా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచ దేశాలను వణికిస్తూ అణ్వాయుధాలతో బెదిరిస్తూ ఉన్నందున ప్రపంచ దేశాలు కొన్ని ఈ సామ్రాజ్యవాదులపై తిరగబడితే ప్రపంచ భవిష్యత్తు ఎటుపోతుందో చెప్పడం కూడా భయమేస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడి అభివృద్ధి చెందిన అమెరికా, ఇప్పుడు ప్రపంచ దేశాలను తన కనుసనల్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. మానవ వనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం, పెట్టుబడులు అన్నీ విదేశాలతో ముడిపడి ఉన్నప్పటికీ, ఆ ఆధారాన్నే సామ్రాజ్యవాదంగా మార్చుకుంటోంది. అమెరికా అభివృద్ధిలో భారతీయుల మేధస్సు, చైనా తయారీ, మెక్సికో వ్యవసాయం, కెనడా ఇంధనం, జర్మనీ యంత్రాలు, జపాన్–దక్షిణ కొరియా సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినా ఈ ఆర్థిక ఆధిపత్యం ద్వారా ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. ట్రంప్ ప్రకటనలను పరిశీలిస్తే వెనిజులా చమురు సంపదపై నియంత్రణే అసలు లక్ష్యమని స్పష్టమవుతుంది. ఇరాన్, సిరియా, నైజీరియా, తాజాగా వెనుజులా అధ్యక్షుడు నికలాస్ మధురో అతని భార్యను కూడా అమెరికా బంధించి నార్కో టెర్రరిజం అని ఆరోపించి న్యూయార్క్ తరలించడం ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలా ఇతర దేశాల్లో జోక్యంతో ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారి అధ్యక్షుడిగా మారి, సామ్రాజ్యవాద విజృంభనకు దారితీస్తున్నాడు. సోషలిజం కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మేలని, స్వేచ్ఛ, ఆర్థిక అభివృద్ధి, ప్రపంచ శాంతి వస్తాయని ప్రచారం చేశారు. కానీ వాస్తవంలో పెట్టుబడిదారులు పాలకులతో చేతులు కలిపి దేశాలను దోచుకుంటున్నారు. ప్రభుత్వాలను కూల్చడం, తమకు అనుకూలమైన వారిని అధికారంలో కూర్చోబెట్టడం ద్వారా వనరులను కైవసం చేసుకుని దేశాల భవిష్యత్తును నియంత్రిస్తున్నారు. పాలకులేమో అన్ని రంగాలను కార్పొరేట్లకు అప్పగించి రాజుల్లా వ్యవహరిస్తున్నారు. ఇలా నిస్సహాయ స్థితిలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నది. నిజానికి పెట్టుబడిదారుడే పాలకుడైనప్పుడు దోపిడీ తప్ప మరో లక్ష్యం ఉండదు. ప్రజలకు అవసరం లేని ఉత్పత్తులు కొనసాగిస్తూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం నిస్సహాయంగా మారి, దాని పేరుతోనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దోపిడీ జరుగుతోంది. ఈ పెట్టుబడిదారులకు పెద్ద దిక్కు అమెరికా. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం తన చట్టాలకు గానీ అంతర్జాతీయ చట్టాలకు గానీ కట్టుబడి ఉండదు. మార్కెట్ విస్తరణ కోసం దిగజారుతున్న తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడం కోసం బలహీన దేశాలపై సైనిక దాడి, రాజ్యాంగం మార్పు పేరుతో ప్రజల రక్షణ కోసం అంటూ రాజకీయ బ్లాక్ మెయిలింగ్ విధానాన్ని అమెరికా అనుసరిస్తున్నది. తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే దేశాలను అమెరికా సహించదు వాటి మీద ఆర్థిక ఆంక్షలు విధిస్తుంది. ఇది ప్రత్యక్ష యుద్ధానికి మరో రూపం. వెనిజులాపై సైనిక దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మధురో అపహరించడానికి కారణం సామ్రాజ్యవాద ప్రయోజనాలే అని అమెరికా అధ్యక్షుడు తానే వివరించి చెప్పారు. నేటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నిజమైన పోటీ మార్కెట్లు లేవు. ఫైనాన్స్ క్యాపిటల్, స్టాక్ మార్కెట్ల ఆధిపత్యంలో దేశాల ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం క్రమంగా నశిస్తోంది. సాంకేతికంగా, సైనికంగా, ఆర్థికంగా అమెరికా అగ్రరాజ్యంగా మారి కార్పొరేట్ రంగానికి పెద్దదిక్కుగా ఉంది. ఎఓఈ, వరల్డ్ బ్యాంక్, ఛీూ, జఔ వంటి సంస్థలను తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగి స్తోంది. అణ్వాయుధాల యుగంలో యుద్ధం అంటే మానవజాతి అం తమే. ఈ పరిస్థితిలో ప్రపంచం మౌనం వహిస్తే భవిష్యత్తే ప్రమా దం లో పడుతుంది. కాబట్టి నేడు ప్రపంచం అగ్రదేశాల ఆయుధ సంపత్తి కింద నడవకూడదు. వీటి నుంచి బయటపడాలంటే డీ గ్లోబలైజేషన్, డీ డాలరైజేషన్, డీ ప్రైవేటైజేషన్ అయితే తప్ప మన దేశంతో పాటు ప్రపంచ దేశాలు కూడా అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.

# మరో యుద్ధం తప్పదా...



పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది. అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది. ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పాలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది. ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది. అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌లకు సిద్ధపడుతోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది. భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్‌లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది. తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పాలస్తీన, గత ఇరాన్ దాడుల సమయంలో ఇలాంటి స్టేట్‌మెంట్‌లు జారీ చేసింది. అయినప్పటికీ, ఇరాన్‌కు సరైన మద్దతు ఇవ్వకుండా బెదిరింపులకు మాత్రమే దిగుతోంది. ఈ టెన్షన్ చమురు ధరలు, గ్లోబల్ ట్రేడ్‌ను ప్రభావితం చేస్తాయి. చైనా హెచ్చరిక అమెరికా వ్యూహాలను ప్రశ్నిస్తూ, మధ్యప్రాచ్య స్థిరత్వానికి సవాల్‌గా మారింది. దౌత్య ప్రయత్నాలు ఫలిస్తాయా అనేది ఆసక్తికరం. టెహ్రాన్‌కు చర్చలు సాగించేందుకు అవసరమైన అడుగులు ఇప్పటికే తెలుసని చెప్పారు. మొత్తంగా పశ్చిమాసియాలో మళ్లీ అలజడి మొదలైంది.

# సుస్మితకు 75 కోట్ల లాభం



**చెన్నై, జనవరి 30:**మెగాస్టార్ చిరంజీవి గురించి మనం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో తనకున్న రికార్డులు ఆయనను చాలా గొప్పగా పరిచయం చేస్తూ ఉంటాయి. 70 సంవత్సరాల వయసులో కూడా ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న యంగ్ హీరోలకు ఏమాత్రం తీసిపోకుండా సినిమాలను చేస్తున్న ఘనత తనకే దక్కుతుంది. అలాంటి చిరంజీవి రీసెంట్ గా 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో సూపర్ సక్సెస్ ని సాధించాడు. ఇక ఈ సినిమాకి తన కూతురు అయిన సుష్మిత ఒక ప్రొడ్యూసర్ గా కొనసాగిన విషయం మనకు తెలిసిందే. ఇక మరో ప్రొడ్యూసర్ గా సాహు గారపాటి వ్యవహరించారు. వీళ్ళిద్దరు కలిసి ఈ సినిమా కోసం 150 కోట్ల బడ్జెట్ ను కేటాయించారు. ఇందులో సుష్మిత కొణిదల 75 కోట్ల వరకు బడ్జెట్ పెట్టినట్టుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమా ఇప్పుడు 400 కోట్ల మార్క్ ను టచ్ చేస్తున్న క్రమంలో దాదాపు 200 కోట్ల వరకు రిటర్న్ వచ్చే అవకాశాలైతే ఉన్నాయి. అంటే తను పెట్టిన పెట్టుబడి 75 కోట్లు తీసేస్తే ఆమెకు దాదాపు 125 కోట్ల వరకు ప్రాఫిట్ అయితే వచ్చినట్టుగా తెలుస్తుంది. ఇక ఏది ఏమైనా కూడా చిరంజీవి తన కూతుర్ని స్టార్ ప్రొడ్యూసర్ గా మార్చాలనే ఉద్దేశ్యంతో తను చేస్తున్న ఈ కమర్షియల్ సినిమాకి ప్రొడ్యూసర్ గా వ్యవహరించమని చెప్పినట్టుగా తెలుస్తుంది. ఎలాగూ అనిల్ రావిపూడి చేసే సినిమా సక్సెస్ ని సాధిస్తుందని చిరంజీవికి తెలుసు...ఒకవేళ తేడా కొట్టిన కూడా ఈ సినిమా పెట్టిన బడ్జెట్ ను రికవరీ చేయగలదనే నమ్మకం చిరంజీవికి ఉంది. కాబట్టే సాహు గారపాటి గారితో కొలాబ్రేట్ చేసి మరి సుస్మిత ని ప్రొడ్యూసర్ గా పరిచయం చేశాడు. ఇక ఏది ఏమైనా కూడా ఈ సినిమా వల్ల సుష్మిత మంచి ప్రొడ్యూసర్ గా అవతరించిందే రాబోయే సినిమాలతో కూడా ఆమె సక్సెస్ ఫుల్ సినిమాలను చేయగలిగితే టాప్ ప్రొడ్యూసర్ గా మారుతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు...

# మేడారానికి పోటెత్తిన భక్తులు..



**ములుగు, జనవరి 30:** మేడారం మహా జాతరలో సమ్మక్క సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. మరో వైపు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.. నేడు మేడారంలో సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. అందుకు ఉన్నతాధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపులను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేడారం ఉత్సవాల్లో భాగంగా బుధవారం.. సారలమ్మ, గురువారం.. సమ్మక్కలు గద్దెపైకి చేరుకున్నారు. దీంతో మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమైనట్లయింది. గురువారం అర్థరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ మేడారం విచ్చేసి.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు వీఐపీలు, వీవీఐపీలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలివస్తున్నారు.

## మున్సిపల్స్.. ఎవరి లెక్కలు వారివి

- మొదటి పేజీ తరువాయి

గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెల కంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

## ఏఐపై మోడీ మేధోమధనం...

- మొదటి పేజీ తరువాయి

మనపై నమ్మకాన్ని కలిగిస్తాయని, అందుకే భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలనివిజ్ఞప్తి చేశారు.ఎఐ అభివృద్ధిలో కేవలం వేగం మాత్రమే కాదు.. భద్రత, పారదర్శకత కూడా ముఖ్యమని మోదీ స్పష్టం చేశారు. ఎఐ దుర్వినియోగం కాకుండా దాని వినియోగం పారదర్శకంగా, న్యాయంగా ఉండేలా పటిష్టమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించాలని సూచించారు. యువతలో ఎఐనైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని నిపుణులను కోరారు.ఈ సమావేశంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ , విప్రో, హెచ్ సీఎల టెక్, జోహో కార్పొరేషన్, జియో ప్లాట్‌ఫామ్స్, అదానీ కనెక్స్ వంటి దిగ్గజ కంపెనీల లతో పాటు.. ఐఐటీ మద్రాస్,ఐఐటీ బాంబే,ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఈ చర్చల్లో భాగస్వాములై, ప్రభుత్వ మద్దతును వారికి వివరించారు.

## తెలంగాణలో వ్యవసాయం భేష్...

- మొదటి పేజీ తరువాయి



లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్ధసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది.అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది. దీనివల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు .. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడా సాగునీరు అందింది. వీటితో పాటు.. చెక్ డ్యామ్‌ల నిర్మాణం , కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే.. సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా.. భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్థవంతంగా సాగు చేసుకునేలా ప్రోత్సహించింది.వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతం వాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ 201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.

## కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...

- మొదటి పేజీ తరువాయి



లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు.ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

## తెలుగు రాష్ట్రాల జల వివాదంపై ఢిల్లీలో కీలక చర్చలు..


- మొదటి పేజీ తరువాయి

అధికారులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ చైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్– వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళి...

**హైదరాబాద్, జనవరి 30:** నేడు (జనవరి 30) భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహాత్ముని త్యాగాలను, ఆశయాలను స్మరించుకున్నారు. సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో బాపు దేశానికి చేసిన సేవల్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతించగా, హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూ ఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**మహాత్మునికి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళి**



'అహింసనే ఆయుధంగా స్వాతంత్ర్య సంగ్రామాన్ని జయించి.. ప్రపంచానికి సరికొత్త పోరాట పంథాను పరిచయం చేసిన వ్యక్తి మహాత్ముడు. జాతిపిత గాంధీజీ వర్ధంతి సందర్భంగా.. ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నాను' అని సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళు లు హైదరాబాద్ లంగర్ హౌస్ లోని బాపూ ఘాట్ వద్ద గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# కమలం గేర్ మార్పు..

- మొదటి పేజీ తరువాయి

దిగుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన కొత్త టీమ్‌తో ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా, చాణక్యుడిగా పేరుగాంచిన అమిత్ షా స్వయంగా ప్రచార పర్వంలో పాల్గొంటుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.ఫిబ్రవరి 2, 3 తేదీల్లో మహబూబ్ నగర్ లేదా ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నిర్మల్ పట్టణాల్లో వీళ్ల భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు జరుగుతుండటం.. బీజేపీ ఈ ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేస్తోంది. మున్సిపాలిటీలపై జెండా ఎగురవేస్తే తప్ప, వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు.బీజేపీ వెనుకబాటుకు ప్రధాన కారణం బయటి శత్రువుల కంటే ఇంట్లోని విభేదాలే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో పాత నాయకులకు, కొత్తగా చేరిన వలస నాయకులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రూపు రాజకీయాలు పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ వంటి జిల్లాల్లో ఇటీవల జరిగిన దాడులు, గొడవలే ఇందుకు నిదర్శనం. అధిష్ఠానం ఎన్ని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఈ చలనం లేని కేడర్‌లో జోష్ నింపేందుకే అమిత్ షా వంటి అగ్రనేతలను బరిలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు



రాకపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగినా అది విజయతీరాలకు చేర్చకపోవడంతో పార్టీ మేధోమథనంలో పడింది.మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ

ఈసారి 'అర్బన్ ఓటర్ల'పైనే ఆశలు పెట్టుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారులు, మధ్యతరగతి ప్రజలే తమను గట్టెక్కిస్తారని నమ్ముతోంది. నితిన్ నబీన్ నాయకత్వంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ వంటి నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించడం ద్వారా ఇతర రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలను ఇక్కడ అమలు చేయబోతున్నారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల మధ్య బీజేపీ తన స్థానాన్ని ఎలా కాపాడుకుంటుందనేది ప్రశ్నార్థకం. కేవలం అగ్రనేతల పర్యటనలతోనే ఓట్లు రాలతాయా? లేక గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి నాయకత్వం ఐక్యంగా ముందుకు సాగుతుందా? అనేది వేచి చూడాలి.బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. తెలంగాణలో ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపు. అమిత్ షా రాకతో పార్టీలో జోష్ రావచ్చు కానీ, ఆ జోష్ ఓట్ల రూపంలోకి మారాలంటే స్థానిక నేతలు అహంభావాన్ని వీడి ఐక్యంగా పనిచేయాల్సి ఉంటుంది. లేదంటే నెంబర్ 2 కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# బీసీలకు మొండి చేయి...?

- మొదటి పేజీ తరువాయి

న్యాయానికి అది నిదర్శనం. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన పాలక పక్షం, ఆ హామీని చట్టంగా మార్చకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. కోర్టు ఆదేశాలు, జనగణన పేరుతో కాలయాపన జరిగింది. చివరకు పార్టీపరంగా టికెట్లు ఇచ్చి బీసీలకు న్యాయం చేసినట్టుగా ప్రచారం చేసింది. కానీ ఈ పరిస్థితి బీసీ వర్గాల్లో అనేక ప్రశ్నలకు దారితీసింది. నిజంగా బీసీలకు రిజర్వేషన్ ఇవ్వాలన్న రాజకీయ సంకల్పం ఉందా?, లేక ఎన్నికల ఒత్తిడిలో తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టుకున్నారా? అని అనుమానాలు వ్యక్తమయ్యాయి.పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కొన్ని స్థానాలు దక్కినప్పటికీ అవి రిజర్వేషన్ వల్ల వచ్చిన హక్కులా?, లేక పార్టీ టికెట్ల పంపిణీలో భాగమా అన్నది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అమలు కాకుండానే పంచాయతీ ఎన్నికలు జరగడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. పార్టీల అంతర్గత కేటాయింపుల పేరుతో కొంతమంది బీసీలకు అవకాశాలు ఇచ్చినా.. అది భరోసా కల్పించే రిజర్వేషన్ కాదని బీసీ నేతలు అంటున్నారు.పంచాయతీ ఎన్నికలతో బీసీ రిజర్వేషన్ అంశంపై ఆయా వర్గాల్లో పాలక, ప్రతిపక్షాల వైఖరిపై స్పష్టత వచ్చింది. రాజ్యాంగం, జనాభా లెక్కలు, న్యాయపరమైన చిక్కులు అంటూ కారణాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలు బీసీ వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ ఇవ్వకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శకులు అంటున్నారు.రిజర్వేషన్ అవసరమని నినాదాలు చేసి.. అమలు చేయాల్సిన సమయంలో మాత్రం చేతులెత్తేస్తారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు లభించిన సీట్లు పార్టీ దయతో వచ్చిన అవకాశాలుగానే మిగిలాయని, దీంతో సరైన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం బలపడుతోంది. చట్టం ఉంటేనే ప్రతి బీసీకి సమాన అవకాశం లభిస్తుందని, లేకపోతే ఇది కేవలం ఎన్నికల హామీగా మిగిలిపోతుందని బీసీలు విమర్శిస్తున్నారు.42 శాతం రిజర్వేషన్ హామీ అమలవుతుందా? లేక మళ్లీ ఎన్నికల దాకా నినాదాలకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్న బీసీ సమాజాన్ని వేధిస్తోంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్ అమలుచేయడంలో అన్యాయం జరిగిందని స్పష్టమవు తుంది. ఇప్పటివరకు ఓర్పుతో ఎదురుచూసిన బీసీ సంఘాలు, మేధావులు, యువత ఇప్పుడు చట్టబద్ధ రిజర్వేషన్ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదని



అభిప్రాయపడుతున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు బీసీల రాజకీయ పోరాటం ముగియదన్న సంకేతాలు ఇస్తున్నారు.హామీలతో కాదు, చట్టంతోనే న్యాయం కావాలన్న డిమాండ్ మరింత బలపడుతోంది. పాలక, ప్రతిపక్షాలపై బీసీ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తి ఉద్యమంగా మారుతుందా.. లేక ఎన్నికల్లో రాజకీయ తీర్పుగా బయటపడుతుందా అని ప్రభుత్వంలోనూ ఆందోళన కలిగిస్తున్నది. 42 శాతం రిజర్వేషన్ కేవలం నినాదం కాదని, బీసీల రాజకీయ భవిష్యత్‌కు కీలక మలుపు అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ అంశంలో ఇంకా జాప్యం జరిగితే భవిష్యత్ ఎన్నికల్లో బీసీల తీర్పు రాజకీయ చరిత్రను మార్చే అవకాశముందని విశ్లేషకులు

అంటున్నారు.తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలటీలకు ఎన్నిలక నోటిఫికేషన్ విడుదల అయింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. కానీ ఇప్పటికీ బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై చట్టపరమైన స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల్లో చేసినట్లే మళ్లీ పార్టీపరమైన సర్దుబాట్లతో బీసీలకు న్యాయం చేసినట్టు చూపించాలని ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని బీసీలు ఆరోపిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో పాలక, ప్రతిపక్షాలు ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శిస్తున్నారు.ఒకవైపు బీసీలే సామాజిక వెన్నెముక అంటూనే మరోవైపు వారి రాజకీయ హక్కులను చట్టంగా మార్చడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా బీసీల మద్దతు పొందుతూనే వారికి హక్కులు కల్పించేందుకు భయపడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ వైఖరే పాలక, ప్రతిపక్షాలపై ఉన్న నమ్మకాన్ని చెరిపేస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైన మార్గాలు కనుగొనడం అసాధ్యం కాదని వాదిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ అమలు సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కావడం లేదన్న ప్రశ్న బలంగా వినిపిస్తోంది. పంచాయతీ ఎన్నికల మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు తీవ్ర నిరాశే ఎదురైందని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి మరోసారి బీసీలకు చేస్తున్న ద్రోహమేనని మండిపడుతున్నాయి. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ, అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెడుతున్నారన్న విమర్శలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి.

# రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత..

- మొదటి పేజీ తరువాయి

పెట్టబోయే పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తానని కవిత ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలస్యం అవుతుండటంతో..ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు కవిత.బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత తెలంగాణ జాగృతి జనం బాట కార్యక్రమం పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారమె. మాజీ సీఎం జయలలితను గుర్తు చేసేలా..ఏకంగా కట్టు, బొట్టు అంతా లుక్‌నే మార్చేసి..జిల్లాల టూర్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ టార్గెట్ చేస్తూ కవిత ముందుకెళ్తున్నారు.ఇక ఇప్పుడు సొంత రాజకీయ పార్టీపై కవిత కసరత్తును వేగవంతం చేశారు. మెజార్టీ నేతలు తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మరికొందరు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో టీఆర్ఎస్ వచ్చేలా చూడాలని కవితను కోరినట్టు సమాచారం. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో..పాత టీఆర్ఎస్‌ను కొత్త పార్టీలో ఉండేలా చూడాలని సూచించారట. అందరి అభిప్రాయాలు తీసుకున్న కవిత..మార్చిలోనే కొత్త



రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు జాగృతి వర్గాల టాక్.ఇప్పటికే జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో మెజార్టీ జిల్లాలను చుట్టేసిన కవిత.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెలాఖరులో మంచిర్యాలలో పెద్దఎత్తున జనం బాట ముగింపు సభను నిర్వహించాలని కవిత నిర్ణయించారు.మంచిర్యాల సభలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించాలా, లేదంటే హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం దగ్గర ప్రకటించాలా అన్నదానిపై ఇంకా ఓ డెసిషన్‌కు రాలేదంటున్నారు. మార్చిలో రాజకీయ పార్టీ ప్రకటించిన వెంటనే తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కవిత భావిస్తున్నారట. పాదయాత్రపై ఇప్పటికే కుటుంబ సభ్యులు, జాగృతి ముఖ్యనేతలతో చర్చించారట.పాదయాత్ర రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధం చేసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాలు కవర్ అయ్యేలా మెజార్టీ అసెంబ్లీ స్థానాలను చుట్టివచ్చేలా పాదయాత్ర రోడ్ మ్యాప్‌ను రెడీ చేస్తున్నారట కవిత. దీంతో కవిత రాజకీయ పార్టీపై పొలిటికల్ సర్కిల్స్‌లోనే కాదు సామాన్య జనంలోనూ సర్వత్రా ఆసక్తి నెలకొంది

# 35వ డివిజన్ బీజేపీ అభ్యర్థిగా మిరియాల నాగమణి వెంకటేశం నామినేషన్ దాఖలు

నల్లగొండ నగర పాలక సంస్థ 35వ డివిజన్ నుంచి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా మిరియాల నాగమణి వెంకటేశం నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... 35వ వార్డులో కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, కేంద్ర జల్ శక్తి మిషన్ ద్వారా రక్షిత మంచినీటి సరఫరా, మున్సిపల్ పార్కుల అభివృద్ధి, పట్టణ పారిశుభ్రత వంటి పనులు విజయవంతంగా చేపట్టినట్లు వెల్లడించారు. కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తోందని తెలిపారు. ప్రజల సామాజిక భద్రత కోసం కేవలం ?12కే ఇన్సూరెన్స్ సౌకర్యం, అలాగే ?330కే అటల్ బిహారీ వాజ్‌పేయి బీమా పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ పట్టణంలో రైల్వే స్టేషన్ అభివృద్ధి, నల్లగొండ బైపాస్ రోడ్డు నిర్మాణం, ఫుట్‌పాత్‌లు, బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. నల్లగొండ పట్టణం మున్సిపాలిటీ నుంచి నగర పాలక సంస్థగా అప్‌గ్రేడ్ కావడంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో ఉందని, నగర అభివృద్ధికి తోడ్పడిన కేంద్ర ప్రభుత్వానికి పట్టణ ప్రజలంతా కృతజ్ఞత



తెలపాలని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ సమగ్ర అభివృద్ధి కోసం అన్ని డివిజన్లలో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను పేరుపేరునా కోరారు.

# మేయర్ అభ్యర్థిగా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు

**నల్లగొండ:** నల్లగొండ నగర పాలక సంస్థలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్ల చివరి రోజున ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్నారు. ఈరోజు ఉదయం నల్లగొండ నగర పాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అదే సమయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుండగా, నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు.



# జంపింగ్ జంపాంగ్ లు

**కరీంనగర్, జనవరి 30:** ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు. తెలంగాణ పురపాలక ఎన్నికల సమయంలో




జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

# పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండి

**సిగాచి ప్రమాద బాధితుల పరిహారం**

**ప్రభుత్వం పట్ల మరోసారి అసహనం వ్యక్తం చేసిన తెలంగాణ హైకోర్టు**

**హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వకపోవడం పై ప్రభుత్వం పై తెలంగాణ హైకోర్టు ఆసహనం వ్యక్తం చేసింది. పరిహారం ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వండని ఆదేశించింది. ఘటనలో మృతి చెందిన 56 మందికి, ఆచూకీ లభించని 8




మందికి, 28 మంది క్షతగాత్రులకు పరిహారం అందించడంతో పాటు, దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయాలని హైకోర్టులో బాబురావు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారిస్తూ, పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు, ఎంత ఇస్తున్నారు, ఎప్పుడు ఇస్తారు అంటూ హైకోర్టు న్యాయమూర్తి ప్రశ్నించారు. పరిహారం పంపిణీకి సంబంధించిన అంశాలపై కంపెనీ వివరణ ఇవ్వాలని, దానికి సంబం ధించిన వివరాలను తెలియజేయాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు, చట్టప్రకారం అందాల్సిన పరిహారం వివరాలను సమర్పించాలని ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండళ్లను హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుమోటో ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసారు.

# పొత్తుల లెక్కలు తేలెదెలా...

**ఖమ్మం, జనవరి 30:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోగా, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటికి సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, తన మిత్రపక్షాలైన వామపక్షాలను కలుపుకుపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం పొత్తుల చర్చల్లో కొత్తగూడెం మున్సిపాలిటీ అత్యంత కీలకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గట్టి పట్టున్న సిపిఐ కొత్తగూడెంలో తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం 60 డివిజన్లలో తమకు కనీసం 30 స్థానాలు కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి 17 స్థానాలకు మించి ఇవ్వలేమని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ 13 స్థానాల తేడా ఇప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. ఒకవేళ కాంగ్రెస్ తన పట్టు సడలించకపోతే, ఒంటరిగా బరిలోకి దిగడమే కాకుండా, తెలుగుదేశం వంటి ఇతర పార్టీలతో కలిసి వెళ్లేందుకు కూడా సిపిఐ సిద్ధమవుతోంది. ఇదే గనుక జరిగితే ఖమ్మం, నల్గొండ, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడే ప్రమాదం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం. మరోవైపు సిపిఎం తీరు ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న ఈ పార్టీ, మున్సిపల్ ఎన్నికల్లో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో ఉంది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల సమయంలో కొన్ని చోట్ల బిఆర్ఎస్, సిపిఎం నేతల మధ్య అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములాను అమలు చేసే యోచనలో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకం కావాలనేది సిపిఎం అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పొత్తు ఉండకపోవచ్చు. స్థానిక బలాబలాలు, నాయకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా పొత్తులు మారే అవకాశం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎంకలిసి పోటీ చేసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను కాదని, రెండు కమ్యూనిస్టు పార్టీలు జతకట్టవచ్చు. నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొన్ని పట్టణాల్లో బిఆర్ఎస్, సిపిఎం మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. వామపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు చేటు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో కమ్యూనిస్టులకు కేడర్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. పొత్తులు కుదరకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, మిత్రపక్షాల ఓట్లు కూడా చీలిపోయి ప్రతిపక్ష బిఆర్ఎస్ లేదా బిజెపికి లాభం చేకూరే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక మాత్రమే కాదు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా మారుతుంది. అందుకే చిన్న పార్టీలను కూడా కలుపుకుపోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఉంది. కానీ, సీట్ల సర్దుబాటులో ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేకపోతే పొత్తులు పొడవటం కష్టమే. మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పొత్తుల గందరగోళం మధ్యే మొదలయ్యాయి. కొత్తగూడెం పీటముడి వీడితేనే కాంగ్రెస్-సిపిఐ బంధంపై స్పష్టత వస్తుంది. సిపిఎం ఏ అడుగు వేస్తుందనేది బిఆర్ఎస్ వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రానున్న రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల ఖరారు, బి-ఫామ్ ల పంపిణీ నాటికి ఈ రాజకీయ గందరగోళానికి ఒక తెర పడే అవకాశం ఉంది.

# మమునూరు ఎయిర్ పోర్ట్ కోసం 300 ఎకరాల భూమిని అందించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్:** వరంగల్ మమునూర్ విమానాశ్రయ నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి 300 ఎకరాల భూమిని అందించింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భూమి పత్రాలు అందించిందారు. రెండున్నర సంవత్సరాల్లో విమానాశ్రయం



నిర్మాణం పూర్తి చేస్తామని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి వైస్ చైర్మన్ ఎమ్మెల్సీ బండ ప్రకాష్, ఎంపీ కడియం కావ్య మరియు ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు పాల్గొన్నారు.

# టీజీ ఈఏపీసెట్ షెడ్యూల్ విడుదల..

**హైదరాబాద్, జనవరి 30:** తెలంగాణ ఈఏపీసెట్ -2026 షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి శుక్రవారం ప్రకటించింది. ఫిబ్రవరి 14వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ దరఖాస్తుల స్వీకరణ చేస్తామని వివరించింది. మే 4, 5వ తేదీల్లో



అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. ఇక మే 9 నుంచి జూన్ 11వ తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగంలో పరీక్ష నిర్వహిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

# ఏపీకి సహకరిస్తున్న రేవంత్ ప్రభుత్వం

**చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్న శిష్యుడు**

**మాజీ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్:** రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. కాళోజీ ముందే ఊహించి చెప్పినట్లు.. ప్రాంతం వాడే తెలంగాణకు చేస్తున్న ద్రోహం ఇదని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం అయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. హరీష్ రావు మాట్లాడుతూ దేశ రాజధాని డిల్లీ కేంద్రంగా తెలంగాణకు జరుగుతున్న జల ద్రోహాన్ని వివరించేందుకే ఈ ప్రెస్ మీట్. ఒక వేళ ఆ తప్పు జరిగితే తెలంగాణ నీటి చరిత్రలో ఈరోజు ఒక బ్లాక్ డే గా మిగిలిపోతుంది. గోదావరి నదీ జలాల అక్రమ తరలింపు విషయంలో దీ=గా మొదటి నుండి అప్రమత్తం చేస్తూనే వస్తుంది. గతంలో అనేక సార్లు ప్రెస్ మీట్ పెట్టినం. వాస్తవాలు బయట పెట్టినం. నామమాత్రంగా బ్యాక్ డేట్ వేసి లెటర్లు మీడియాకు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నమని అన్నారు. అది బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా మారింది పేరు మాత్రమే కానీ, ఏపీ జల దోపిడి ఆగలేదు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుది అయితే, పొడిచేది రేవంత్ రెడ్డి. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని అన్నారు. ఈరోజు డిల్లీలో జరుగుతున్న ఇరిగేషన్ మీటింగ్ సాక్షిగా రేవంత్ ప్రభుత్వం మరణ శాసనం రాయబోతున్నది. పోలవరం నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరు గమనిస్తే... పోను పోను అనుకుంటూనే రేవంత్ రెడ్డి ఆనాడు డిల్లీ మీటింగ్ కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకం పెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాసాడు. వేయను అంటూనే కమిటి వేసి ఏపీ జల దోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీం కోర్టు కు వెళ్ళి నల్లమల సాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పస లేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమల సాగర్ కు మద్దతు ప్రకటించాడు. దానికి వాపస్ తెచ్చుకున్నడు ఉత్తం. ప్లాన్డ్ గా సహకరిస్తూ చంద్రబాబుకు రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో జరుగుతున్న మీటింగ్ లో నేడు ఇంజినీర్లు పాల్గొంటున్నారు. పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీలను గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్ర ఇది. ఇలాగే గతంలో కేంద్ర జల్శక్తిశాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు. బిఆర్ఎస్ నిలదీస్తే..డిసెంబర్ 30వ తేదీన నేను ఉత్తరం రాస్తే.. తెల్లారి ఒక మీటింగ్ రాసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో ఏముంది.. ఏపీ నల్లమల సాగర్ విషయంలో ముందుకు పోతుంది, డిపిఆర్ ప్రక్రియ ముందుకు పోతుంది అని స్పష్టంగా రాసిందని అన్నారు. దీంతో పాటు ఇంకేం రాసారు.. రెండు కండీషన్లకు ఒప్పుకుంటేనే ఢిల్లీ మీటింగ్ కు వస్తం అన్నరు. మొదటి కండీషన్ ఏమిటంటే నల్లమల సాగర్ కు డిపిఆర్ వెంటనే ఆపాలి, కేంద్రం అనుమతుల ప్రక్రియను తక్షణం ఆపాలి అని.. రెండోది.. ప్రీ ఫీజబులిటి రిపోర్టు ఆపినట్లు ఏపీ హామి ఇవ్వాలని రాసారు? నా ప్రశ్న ఏమిటంటే.. ఈ రెండు కండీషన్లకు కేంద్రం హామి ఇచ్చిందా? ఏపీ హామి ఇచ్చిందా? నీ అప్రువల్ తోనే లెటర్ పోయింది కదా ఉత్తం గారు ఎందుకు హామి లేకుండా పాల్గొంటున్నారు. ఎందుకు ఈరోజు మీటింగ్ కు ఎగేసుకొని పోయారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే రేవంత్ రెడ్డి పట్టించుకోడు, మీరైనా ఎందుకు పట్టించుకోరు ఉత్తం గారు. ఈ మీటింగ్ కు వెళ్లేది ఆదిత్యా నాథ్. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు మీటింగ్ లో పాల్గొన్న ఆదిత్యా నాథ్ దాస్, కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్ లు అన్నీ అక్రమ ప్రాజెక్టులు, వీటిని నిలిపి వేయాలని చెప్పాడని అన్నారు.




తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన వ్యక్తిని మీటింగ్ కు పంపడం అంటే తెలంగాణ ద్రోహం చేయడానికే కదా? మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజనీర్ దొరకలేదా? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోను పోను అంటూనే మీటింగ్ లకు అటెండ్ అవడం అంటే ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్ప చెప్పడమేనా మీ చర్చల లక్ష్యమా? కేసీఆర్ గోదావరిలో 400 టిఎంసీలు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డిపిఆర్ లు పంపి 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డిపిఆర్ పంపింది లేదు, ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడో టిఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్ లు వాపస్ చేసింది. రేవంత్ రెడ్డి పాలనలో డిపిఆర్ లు వాపస్ వచ్చిన పరిస్థితి. మన డిపిఆర్ లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమల సాగర్ కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డి నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. తెలంగాణ నీటి హక్కులను కాలరాసేందుకు ఏపీ ఒత్తిడితో కేంద్రం నిర్వహిస్తున్న ఈరోజు ఢిల్లీ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. నువ్వు పెట్టిన కండీషన్లకు వచ్చిన సమాధానం బయట పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. రేవంత్ రెడ్డి.. నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తం. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20లక్షల ఎకరాల మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బిఆర్ఎస్ సాధించింది. బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మంచిది. కేంద్రంలోని మి ప్రభుత్వమే తెలంగాణ ప్రగతి పథాన్ని వివరిచింది. కళ్లు తెరవండి అనవసరంగా బిఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి. మేమేమో తెలంగాణకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తే, రేవంతు ఏపీకి నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేసిండు. నీటిని ఒడిసి పట్టింది కేసీఆర్ విడిచి పెట్టింది రేవంత్ సోయి లేని రేవంత్ నల్లమల సాగర్ కు జెండా ఊపుతున్నడు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం మీటింగ్ బాయికట్ చేయాలి. ఢిల్లీకి, దావోస్ కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదు. బిఆర్ఎస్ సేద్యంపై దృష్టి సారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని అన్నారు.

# రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి ఇంట్లో ఏసీబీ సోదాలు

**అక్రమాస్తుల కేసులో అటెండర్ తిరుమలేశ్‌పై చర్యలు**

**రూ.50 కోట్లకు పైగా మార్కెట్ విలువైన ఆస్తులు గుర్తింపు**

**11 స్థిరాస్తులు, భారీగా బంగారం, వెండి స్వాధీనం**

**తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఏకకాలంలో తనిఖీలు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇంట్లో రూ.50 కోట్లకు పైగా అక్రమాస్తులు బయటపడటం తీవ్ర కలకలం రేపింది. తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రేడ్-3 ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న నల్లిపోగు తిరుమలేశ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ చూసి అధికారులే విస్మయానికి గురయ్యారు. అక్రమాస్తుల కేసులో కొద్ది రోజుల క్రితమే సస్పెన్షన్‌కు గురైన తిరుమలేశ్‌పై ఏసీబీ అధికారులు నిఘా పెట్టారు. గురువారం తిరుపతిలోని ఆయన నివాసంతో పాటు నెల్లూరు జిల్లా డీసీ పల్లెలోని ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మొత్తం ఐదు చోట్ల ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో ఇప్పటివరకు 11 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు, 1.47 కిలోల బంగారం, 8.77 కిలోల వెండి ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.15.26 లక్షల నగదు, ఇంట్లోని విలువైన ఫర్నిచర్, ఇతర గృహోపకరణాలను కూడా సీజ్ చేశారు. ఓ సాధారణ స్థాయి ఉద్యోగికి ఈ స్థాయిలో ఆస్తులు ఎలా సమకూరాయన్న కోణంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekativelunewsdaily@gmail.com**